# మంత్ర మహిమ

## రాజతరంగిణి కథ

ఆ నాటి పొద్దుటివేళ శ్రీనగరం అంతా అట్టుడికిన ట్టుడికిపోయింది! ఆమె ఇంచుమించుగా యాభై ఏళ్ళు నిండిన పండుముత్తయిదువు! అసలే పసినిమ్మ పండువంటి శరీరచ్ఛాయ! ఆపైన ముఖాని కంతటికి ఒత్తుగా పసుపు పూసుకున్నది. నుదుట గుండ్రని పెద్ద కుంకుమతిలకం దిద్దుకున్నది. దానిమీద పలచ పలచగా జీరాడుతున్న ముంగురులు పైడి జలతారు పోగులవంటి బాలభానుని కిరణాలలో తిలలు, తండులాలు కలబోసినట్టు మెరుస్తున్నాయి. ప్రాణం జివ్వు మనిపించే చలి భరించలేక, ఆమె మాటిమాటికి కాశ్మీరశాలువాతో ఒళ్ళంతా కప్పుకుంటున్నది!

ఆ వృద్ధ పుణ్యస్త్రీవైపు చూసి తమ జన్మభూమి కాశ్మీరానికంతటికి చల్లనితల్లి, హిమవంతుని ముద్దుల పట్టి ఆ పార్వతీదేవి తానై అక్కడ ఆ విధంగా ప్రత్యక్ష మయినదేమో అని మొట్టమొదట పౌరు లెంతయినా ఆశ్చర్యపడ్డారు!

కాని తన కెన్నటికి తీరని దురన్యాయం జరిగి పోయిందని చంద్రాపీడచక్రవర్తి కెరిగించడానికే ఆమె ఆ విధంగా సార్వభౌముని సౌధంముందు ఆమరణాంత ప్రాయోపవేశదీక్ష ప్రారంభించినదని తెలియ గానే వా రింక తమ కన్నులే నమ్మలేకపోయారు!

చేతులెత్తి నమస్కరించదగిన ఆ ఇల్లాలి నంతటి దారుణ యాతనపాలు చేసిన పాపాత్ము లెవ్వరు? ఇంతకి ఆ దురన్యాయ మేమిటి? కాశ్మీరంలో అంతట అపర ధర్మమూర్తి అని ప్రసిద్ధి కెక్కిన చంద్రాపీడ సార్వభౌముని పరిపాలనలోనే అంతటి దారుణమా? శ్రీనగర దండనాయకులు, న్యాయాధీశ్వరులు అందరు ఏమయిపోయారు? వారెవ్వరికి ఆమె గోడే పట్టలేదా?

వారి ఆలోచన లా తీరులో సాగిపోయాయి. ఆ వార్త ఆనోట, ఆనోట అంచెలంచెలుగా చక్రవర్తి చెవిదాకా వెళ్ళింది. అత డా మాట వింటూనే నిలువునా నిర్ఘాంత పడ్డాడు.

వెనువెంటనే అంతఃపుర పరిచారికల నిద్దరిని ముందుంచుకుని ఆ వృద్ధబ్రాహ్మణిని సమీపించాడు. అల్లంత దూరంలో చక్రవర్తిని చూస్తూనే ఆ వృద్ధ మహిళ చీరచెరగుతో ముఖం కప్పుకుని సన్నగా, జాలిగా హృదయ విదారకంగా విలపించింది.

అప్పటికప్పుడే జాము పొద్దెక్కింది. అందువల్ల రాజ భవనంముందు కూర్చున్న ఆమెతో ప్రాయోపవేశ వ్యవహారాన్నిగురించి ప్రసంగించడం భావ్యంకాదని, ఆ వృద్ధురాలి నెలాగయినా తన పూజాగృహంలోనికి వెంటబెట్టుకుని రావలిసిందని కాశ్మీరాధిపతి పరిచారికల కాజ్ఞాపించాడు. ఆలోగా అతని కామె పూర్వ వృత్తాంతం గ్రహించుకోవాలన్న ఆలోచన కలిగింది.

అతి త్వరితంగా నిలుచున్నపాటుగా తన సమక్షానికి పిలిపించిన శ్రీనగర దండనాయకుని ముఖతః ఆమె పుట్టుపూర్వోత్తరాలు, ప్రాయోపవేశ కారణాలు కొంత వరకు రాబట్టుకున్నాడు చక్రవర్తి.

ఆ బ్రాహ్మణి పేరు గౌరీమణి. భర్త పరమశివ సోమయాజి. శ్రీనగరం శివారులో అతని కొక పూరిల్లు, రవంత పెరడుతప్ప ఇక వేరే సంపత్తి ఏదీ లేదు. అయితే వేదవేదాంగాలలో విద్వాంసుడయినందువల్ల వచ్చిన పేరుప్రఖ్యాతులతో యజ్ఞయాగాదులు చేయిస్తూ ఆ యాజకవృత్తితోనే మర్యాదగా తన మనుగడ కొనసాగించుకుంటున్నాడు. చాలా సాధువు. మితభాషి. ఇరుగుపొరుగుల గొడవంటేనే అతని కెంతో చిరాకు! వాటి కప్పింటికి దూరదూరంగా తొలిగిపోతాడు.

అతనికి పట్టుమని యాభై అయిదేళ్ళయినా పూర్తిగా నిండలేదు. గొప్ప బలశాలి. ఎంతటి పెద్ద వరద వచ్చినా ఇట్టే ఈదుకుపోయి వితస్తానది ఆవ్వలితీరం చేరుకోగలడు! పుట్టినప్పటినించి ఎన్నడు జ్వరమని చీది ఎరగడు!

ఉక్కుముక్కవంటి అటువంటి మనిషి అర్ధరాత్రి వరకు హాయిగా గుర్రుపట్టి నిద్రపోతూ అకస్మాత్తుగా మొన్నరాత్రి పరమపదించాడు! సోమయాజి కొక్కర్తె కుమార్తె. పిల్లలతో, పాపలతో ఆమె అత్తవారింట సుఖంగా కాపరం చేసుకుంటున్నది. ఇంతకి

పి. గణపతిశాస్త్రి

ఆమె ఆ విధంగా ఆమరణాంత ప్రాయోపవేశదీక్ష స్వీకరించడానికి గల అసలు కారణమేమో ఎవ్వరికి అంతుపట్టడంలేదు! పోనీ అనుకుంటే తనఎడల జరిగిన దురన్యాయాన్ని గురించి గౌరీమణి ఎవ్వరిదగ్గిర మొరపెట్టుకోవడంకూడా జరగలేదు! అంతేకాదు! ఆమె అంతకుమును పెన్నడు వీథి ముఖంకూడా చూసి ఎరగని పరమసాధ్వి.

ఆమె సంసార పరిస్థితిని గురించి దండనాయకుడు ఇంకా ఏమేమో నివేదించబోయాడు. కాని అంతలోనే గౌరీమణి తన సమక్షానికి రాబోతున్నదని పసికట్టి చక్రవర్తి ఇక అంతకన్న విశేషా లక్కరలేదన్నట్టు చిన్న కనుసన్నతో నివారించాడు. అత్యంత భయభక్తులతో నమస్కరించి దండనాయకుడు తొందరతొందరగా అక్కడినించి నిష్క్రమించాడు.

**అగోచరమైన కొన్ని నేరాలకు ఏ కాలంలోనూ శిక్షాస్మృతి లేదు. నిష్కళంకమైన మనస్సు ధర్మ నిర్ణయం చేసినపుడు, శాసనబద్ధం కాకపోయినా, దోషి తన తప్పును అంగీకరించి, శిక్ష ననుభవించడానికి సిద్ధం అవుతాడు. అనుమానమే రాక్షసిరూపంలో వెన్నంటి తిరుగుతుంది.**

చక్రవర్తి కెదురుగా చిత్రాసనంమీద గౌరీమణిని కూర్చుండబెట్టి అంతఃపుర పరిచారిక లక్కడినించి తొలగిపోయారు; పూజాగృహాని కవతల కాశ్మీరాధిపతి ఆనతికోసం ముంగురులపై దోసిళులొగ్గి నిలుచున్నారు. సార్వభౌమునివైపు కన్నెత్తి చూచి గౌరీమణి తిరిగి పైటచెరగుతో ముఖం కప్పుకుని వలవలా విలపించడం ప్రారంభించింది. ఆమె ఎందు కలాగ దుఃఖిస్తున్నదో చక్రవర్తి కవగతం కాలేదు. అయినా ఎంతెంతటి దుఃఖాలయినా ఓర్చుకోక తప్పదన్న ధోరణిలో చల్లని పలుకులతో సమాశ్వాసించాడు. ఆ ఓదార్పుపలుకులతో గౌరీమణి కొంచెం తేరుకున్నది. అయినా ఆమె గొంతులో గద్గదిక పూర్తిగా తొలగలేదు.

"మహాప్రభూ! పామరు లింకొకరి పచ్చ చూడలేక కళ్ళలో నిప్పులు పోసుకోవడం లోకంలో ఉన్నదే! కాని . . ."

గౌరీమణి డగ్గుత్తిక బరువుతో మరి మాట్లాడలేక పోయింది. చంద్రాపీడు డెంతో ఆత్రంగా తిరిగి ప్రశ్నించాడు.

"అమ్మా . . . అయితే ఇంతకి ఏమి జరిగింది?..."

అయినా ఆ పండుముత్తయిదువు ఆతని ప్రశ్న కేవిధంగాను సూటిగా సమాధానం చెప్పలేదు.

"మహారాజా! లోకం తీరుతెన్ను లెరిగిన మీవంటి ఏలికల సమక్షంలో నే నేమని విన్నవించుకోగలను? ... మహా విద్వాంసులయిన బ్రహ్మణ్యులే, ఇతరుల విద్యాధిక్యం గమనించి ఓర్వలేక పట్టరాని ఈర్ష్యాసూయలతో అట్టుడికి నట్టుడికిపోతారు! నిజానికి చదువుకున్నవారిలో ఉన్నంత ఓర్వలేనితనం మరి ఇతరుల కుండనే ఉండదు."

సార్వభౌమునిలో ఆత్రత మరింత ఎక్కువయింది.

"అయితే సోమయాజిగారిఎడల అంతటి అసూయతో మగ్గిపోయినవా రెవ్వరు? దానికి గల కారణ మేమిటి? ఆయనగాని తోటివిద్వాంసుల నెవ్వరి నయినా శాస్త్రవాదంలో ఓడించి అవమానించారా?"

గౌరీమణి చీర చెరగుతో కళ్ళు రెండు గట్టిగా ఒత్తుకున్నది.

"మహారాజా! మావారిని గురించి మీ రీ రాజధానిలో ఎవ్వరినయినా అడిగి తెలుసుకోవచ్చును! తమ యజ్ఞయాగాలేవో తామేమోకాని, వారి కింకొకరి గోడే అక్కరలేదు! ఇతరుల నెన్నడు ఒక్క పల్లెత్తు మాటయినా అని ఎరగరు! పైవారినుండి ఎప్పుడు ఆశించినదేది లేదు! ఆ దైవం ఇచ్చినదేదో దానితోనే సంతృప్తిపడేవారు! పైగా తమ కున్నంతలోనే ఇతరుల నాదుకునేవారు! ఒక్కనాడయినా వారి నోటినుండి ఒక్క పరుషపుమాట వెలువడలేదు. నే నెరిగినంత వరకు ఒక్కనాడు శరీరంలో నలతగా ఉన్నదని అనలేదు!"

కాశ్మీర చక్రవర్తి మరి ఓరిమి వహించలేక పోయాడు.

"అమ్మా! ఇంతకి మీకు జరిగిన ఆ దురన్యాయ మేమో తెలియనప్పుడు నేనేమి చెయ్యగలను? . . . ఇంతకి ఏమి జరిగింది? . . . రవంత దుఃఖం దిగ

మింగుకుని..."

"ధర్మసంరక్షకులయిన మీ కింక ప్రత్యేకించి నే నేమని విన్నవించుకోగలను? ధర్మదేవతం నాలుగు పాదాలతోను పారాడుతున్న మీ ఏలుబడిలోనే ఇటువంటి ఘోరం జరిగిపోయింది! నిక్షేపంలా తిని తిరుగుతున్న ఆయన హాయిగా నిద్రిస్తూనే అర్ధరాత్రి వేళ అకస్మాత్తుగా అకాలమృత్యువు పాలయినట్టున్నారు! నిన్నటి పొద్దుటే నా కా సంగతి తెలిసింది. ఆ తరవాత మా పెరడులో ఒక మూల రక్తసిక్తమయిన చేతబడి పిండిబొమ్మ కనిపించింది! దానివల్లనే అరవై ఏళ్లయినా నిండకముందే ఆయన కంతటి అకాల దుర్మరణం సంభవించింది! అదీ మీ ధర్మపరిపాలనలోనే — "

ఆ వృద్ధబ్రాహ్మణి ఉవ్వెత్తుగా ఉప్పొంగుతున్న దుఃఖం నిగ్రహించుకోలేక హీనస్వరంతో గోలుగోలున విలపించింది. కాని సార్వభౌముని ఉపశమన వాక్యాలతో మరికొంత సేపటికి తేరుకుంది.

"అయితే ఆ చేతబడి చేసినవా రెవ్వరంటారు?"

సార్వభౌముడు తిరిగి అనునయస్వరంతో ప్రశ్నించాడు. మాటిమాటికి వస్తున్న ఎక్కిళ్లను అతి కష్టంమీద దిగమింగుకుని గౌరీమణి తిరిగి తన గోడు వెళ్లడించుకున్నది.

**స్తుతి**

**స్తుతి చేసే వ్యక్తుల్లో పడేకంటె కాకుల గుంపులో పడటం ఉత్తమం. చనిపోయేవాళ్లని పొడిచేవి కాకులు — బ్రతికున్నవాళ్లను పొడిచేవాళ్లో స్తోత్రాలు పలికేవాళ్లు.**

**—ఏంటిస్థీన్స్**

"మహారాజా! మన రాజధానికి పదిక్రోసుల దూరంలో ఉన్న మాక్షికస్వామి గ్రామంలో చిన్ననాటినించి మావారి సహాధ్యాయి కేశవభట్టని ఒకాయన ఉన్నారు. ఆయన పైపైకిమాత్రం ఆప్తమిత్రులన్నట్టే మాట్లాడుతూంటారు! కావడానికి కొండంత విద్వాంసులే! అయితేమాత్రం లాభమేమిటి? యజ్ఞయాగాలు చేయించడంకోసం మా ఆయన్ని ఎవ్వరు పిలవకుండా చెయ్యాలని చాలా కాలంనించి పన్నాగాలు పన్నుతున్నా డా వేదవేత్త! . . ."

గౌరీమణి మరి ప్రసంగించలేకపోయింది. ఏమనడానికి పాలుపోక చక్రవర్తి క్షణకాలం మౌనం వహించాడు. గౌరీమణి తిరిగి క్షీణస్వరంతో ప్రారంభించింది.

"ఆ కుతంత్రాలన్ని మావారు అప్పుడప్పుడు నాతో చెబుతూండేవారు! అయినా ఒక్కనాడు ఆయన ఆ భట్టునేమి అనలేదు. 'పోనీలే! ఏ కర్రని నిప్పంటే ఆ కర్రే కాలుతుంది!' అనేవారు! . . . అన్ని మనస్సులోనే నిగ్రహించుకుని మాట్లాడకూరుకున్నారు! చిట్టచివరికి ఆ మహానుభావుడే ఇంతటి కానిపని తలపెట్టి ఈవిధంగా ఆయన ప్రాణం తీశాడు! . . ."

దుర్భర దుఃఖోద్వేగంతో గౌరీమణి మరి నోరు మెదపలేకపోయింది. సార్వభౌము డంతలోనే అందుకున్నాడు.

"అయితే, హోమయాగాలంటే కిట్టనివా రింకెవ్వరు లేరా, అమ్మా? . . ."

"లేరు, మహారాజా! ఎవ్వరూ లేరు! అంతటి పుణ్యమూర్తి మీద అసూయపడేవా రెవ్వరుంటారు, అన్నివేదాలు అధ్యయనంచేసినా, ఒంటబట్టని ఆ కేశవభట్టు ఒక్కరేకాక?"

"అయితే, సరే! నే నా కేశవభట్టుగారి నిక్కడికి పిలిపించి స్వయంగా విచారిస్తాను సరిగదా! మీరిక ఈ ప్రాయోపవేశం విరమించండి!"

చంద్రాపీడచక్రవర్తి అంతటి మహనీయ ప్రభువు, ధర్మమూర్తి మిక్కిలి గౌరవంతో చేతులుకట్టుకుని వేడుకున్నాడు. అయినా ఆమె తన పట్టు విడిచిపెట్టలేదు.

"మహారాజా! నే నింతకుముందే, ఆనాడే ఆయనతో సహగమనం చేసిఉండవలసింది. అయితే ఆ సాధుమూర్తికి న్యాయం చేకూర్చనిదే సహగమనం ధర్మంకాదని నే నింతవరకు ఇలాగే ఈ పుణ్యస్త్రీ మర్యాదతోనే ఓరిమి వహించాను. అంతటి మహనీయులే అస్తమించినప్పు డిక అన్నపానాలతో నా కవసరమేమిటి? . . . ఈ దురన్యాయాని కింక తమ ఏలుబడిలో నిష్కృతి జరగకపోతే, నే నిలాగే ఆకటి చిచ్చులో అల్లల్లాడిపోతూ, వారి పాదపద్మాల స్మరణతోనే పరలోకం చేరుకుంటాను. నావంటివారి కిదే కదా ఉత్తమ కులీనధర్మం!"

అయినా చక్రవర్తి తిరిగి ఒకటిరెండు సారులు చెప్పి చూశాడు. కాని తలవంచుకుని కూర్చున్న గౌరీమణి మరి పెదవి కదపలేదు! అలాగే కుమిలి కుమిలి పలవించింది. అటుపిమ్మట పరిచారిక లామె నక్కడినించి తిరిగి రాజభవన ప్రాంగణానికి వెంటబెట్టుకుపోయారు.

## 2

చంద్రాపీడచక్రవర్తి ఆనాడు తన ధర్మసభా భవనంలో తలపట్టుకుని కూర్చున్నాడు. "ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య" అన్నట్టున్నది ఆ వ్యవహారం! ఇక మిగిలిన సాక్ష్యాధారాలేవి లేనప్పుడు, ఎంతటి సాధ్విఅయినా గౌరీమణి మాట పట్టుకుని, ఆ కేశవభట్టుమీద నింద మోపి శిక్షించడ మెలాగ? శిక్షించకపోతే గోమాతవంటి గౌరీమణి ఆకటిచిచ్చులో అలాగే కాలి నుసి అయిపోతూ తన సహగమనం నిర్వర్తించుకోగలనని భీష్మించుకుని కూర్చున్నది! ఇటువంటి వ్యవహారంలో దోషిని నిర్ణయించడ మెలాగ? గౌరీమణి వాఙ్మూలమేకాక, కేశవభట్టుమీద నింద మోపి శిక్షించడానికి వేరొక విధమయిన సాక్ష్యమే లేదు! ఆమె చెప్పినదంతా యథార్థమే అని నిశ్చయించడ మెలాగ? నిశ్చయించినా వేరొక సాక్ష్యమేది లేనప్పుడు కేశవభట్టుమీద నింద మోపి శిక్షిస్తే అది కేవలం బ్రహ్మహత్య కాదా? చక్రవర్తి హృదయంలో ఆ విధంగా ఎడతెగని మథన చెలరేగింది.

ఆ ధర్మసభాభవనంలో తమతమ కేర్పరిచిన పైడిసింహాసనాలపై కూర్చున్న వృద్ధమంత్రులు గాని, ప్రముఖ న్యాయాధీశ్వరులుకాని ఆ జటిల ధర్మనిర్ణయాని కేవిధంగాను సమాధానం చెప్పలేకపోయారు. అది కేవలం మంత్రతంత్రాలతో సంబంధించిన వ్యవహారం!

అసలు చేతబడి కంతటి దారుణ శక్తి ఉన్నదా? ఉంటే కిట్టని సగవారి నెవ్వరినయినా ఆ విధంగా అవలీలగా కాటికిపంపించివెయ్యవచ్చునా? ఆ విధమయిన మంత్రశక్తిని పూర్తిగా నమ్మవచ్చునా? ఇటువంటి సందేహాలెన్నో వారి కందోళనతోపాటు తీవ్ర సందేహం కలిగించాయి.

అప్పైన చక్రవర్తి "ఈ విషయంలో మీ అభిప్రాయ మే"మని ఆనా డక్కడికి ప్రత్యేకించి పిలిపించిన రాజపురోహితునివైపు చూసి ప్రశ్నించాడు.

అతనికి సార్వభౌముని ఆందోళన కారణం అంతా అంతకుముందే అవగతమయింది. అయినా ప్రత్యేకించి ప్రశ్నించనప్పుడు అనవసరంగా తా నెందుకు కలుగజేసుకోవాలని తటస్థంగా మాట్లాడకూరుకున్నాడు.

చంద్రాపీడ సార్వభౌము డా తీరులో తన జిజ్ఞాస వెల్లడించినప్పు డిక మౌనం మర్యాదకాదని వినయంగా లేచి నిలుచున్నాడు.

"ధర్మమూర్తీ! ఆలోచించగా, ఆలోచించగా ఈ విషయంలో నా కిప్పుడు ఒకేఒక మార్గం గోచరిస్తున్నది. ఇటువంటివారిని పరీక్షించడానికి తాంత్రిక పద్ధతి ఒకటి ఏర్పడిఉన్నది. దానినిబట్టి కేశవభట్టారకులు ఈ దుశ్చర్య కొడిగట్టినది, లేనిది నిస్సందేహంగా నిర్ణయించవచ్చును."

'అదేమి' టన్నట్టు బొమముడి విరిచాడు చక్రవర్తి. రాజపురోహితు డది సమగ్రంగా వివరించాడు. ఏదయినా ఒక ప్రసిద్ధ దేవాలయం చుట్టూరా తెల్లని వరిపిండితో ఒక చిన్న బాట ఏర్పాటుచేస్తారు. బ్రహ్మహత్య చేసినట్టు ఆరోపించిన దోషి ఆ బాటలో నడిచి ఆ దేవళానికి ముమ్మారు ప్రదక్షిణంచెయ్యాలి. అదే సమయంలో ఆ తంత్రానికి సంబంధించిన మంత్రాలన్ని ఆ తంత్ర పద్ధతి తెలిసిన పురోహితుడు గంభీర స్వరంతో ఎలుగెత్తి ఉచ్చరిస్తాడు. ముద్దాయి బ్రహ్మహత్య చేసిన పాపిఅయితే అతన్ని అనుక్షణము వెంటనంటి అనుసరిస్తున్న భయంకర బ్రహ్మహత్యా రాక్షసి అడుగుజాడలు ఆ బాటలో అచ్చొత్తినట్టు కొట్టవచ్చినట్టు సాక్షాత్కరిస్తాయి! లేకపోతే కనిపించవు! అప్పు డా వ్యక్తి ఏ పాపము ఎరగని నిర్దోషి అన్న మాట!

ఆ తంత్రపద్ధతి అంతా అత్యంత శ్రద్ధతో ఆలకించినా చక్రవర్తి కింకా సందేహం తొలగలేదు. తిరిగి ప్రశ్నించాడు.

"ఇటువంటి పరీక్ష లింతకుముందు పెన్నడయినా జరిగి దోషుల ఆనుపానులన్ని తెలిశాయా?"

రాజపురోహితుడు శిరస్సు రవంత వంచుకున్నాడు.

"మహాప్రభూ! తమవంటి ధర్మసంరక్షకుల కాలంలో ఇటువంటి ఘోరా లెందుకు జరుగుతాయి? నే నెరిగినంతవరకు తమ జనకులకాలంలోనే ఇటువంటి తాంత్రిక పరీక్ష ఒకటి జరిగింది. మూడవ ప్రదక్షిణ సమయంలో ముద్దాయి అడుగుల వెనక బ్రహ్మహత్య పాదముద్రికలు కొన్ని కొట్టవచ్చినట్టు కనిపించాయి! ఆపైన దోషి తా నా ఘోరకృత్యం చేసినట్టు అంగీకరించడం జరిగింది!"

అటుపిమ్మట వృద్ధమంత్రి లేచి అదిఅంతా యథార్థమయినట్టు, ఆ తంత్రపద్ధతి తాము

స్వయంగా దగ్గరఉండి నడిపించినట్టు వెల్లడించాడు. అయితే అటువంటి తంత్ర పరీక్ష జరిపించగల మంత్ర వేత్త శ్రీనగరానికి అనతిదూరంలో ఒక కుగ్రామంలో నివసిస్తున్నట్టు తెలియవచ్చింది. వెనువెంటనే సార్వభౌముని ఆజ్ఞతో ఆ మంత్రవేత్తకోసం తొందర తొందరగా కబురు వెళ్లింది.

కాని చక్రవర్తి కింకా ఒక పెద్ద బరువు కుంగదీస్తున్నట్టనిపించింది. ఆ పరీక్ష జరిగిన తరవాత కేశవ భట్టు ఒకవేళ నిర్దోషి అని తేలినపక్షంలో గౌరీమణి చేత ప్రాయోపవేశదీక్ష విరమింపజెయ్యాలి. ఆ ఇల్లాలు



దాని కంగీకరించినప్పుడు తన ధర్మకర్తవ్యం పూర్తిగా ముగిసిపోయినట్టే!

కనక అదే వ్యవహారం శీఘ్రమే అంతఃపుర పరిచారికలద్వారా గౌరీమణి కెరిగింపజేయించాడు. ఇనుమడిస్తున్న పట్టుదలతో ప్రాయోపవేశం కొనసాగిస్తున్న ఆ వృద్ధమహిళ ఆ తాంత్రిక పద్ధతి వ్యవహారం విని కొంతసే పాలోచించింది. పోనీ ఆ తీరులోనయినా న్యాయం జరిగితే తన కంతకన్న కావలసినదేమి లేదని దాని కంగీకరించింది.

అయితే దోషిని మున్ముందుగా క్షుణ్ణంగా పరిక్షించిన పిమ్మటే ఆ తంత్రపద్ధతి నడిపించడం సరిఅయిన మార్గమని చంద్రాపీడచక్రవర్తి నిర్ణయించుకున్నాడు. ఆ పరిశీలనవల్లనే కేశవభట్టు దోషి అయినదీ, కానిదీ కొంతవరకు నిర్ధారణగా తేల్చుకోవచ్చునని ఆలోచించాడు.

## 3

ఆ పరీక్ష జరిగే పర్యంతము పచ్చి మంచినీళ్లయినా ముట్టక గౌరీమణి అదేవిధంగా నిరాహారదీక్ష కొనసాగిస్తున్నందువల్ల త్వరలోనే కేశవభట్టు వ్యవహారం పరిశీలించవలసిన ఆవశ్యకత కలిగింది. దట్టంగా గుబురుగా పెరిగిన కనుబొమ్మలమధ్య చిన్న కుంకుమబొట్టుతో, నుదుటిపై పొడవయిన విభూతిరేఖలతో, మెడలో ఒత్తుగా వేసుకున్న రుద్రాక్షమాలికలతో ధర్మసభా భవనంమధ్య నిలిచిన కేశవభట్టువైపు చూసిన పిమ్మట సదస్యులెవ్వరికి అత డంతటి ఘోరకృత్యం తలపెట్టగలడన్న అనుమానంకూడా కలగలేదు! అయినా ప్రధానన్యాయాధికారి తన పరీక్ష విరమించదలుచుకోలేదు!

"చేతబడి చేసి, మీరే పరమశివ సోమయాజిగారి అకాల దుర్మరణానికి కారకులయినారని ఆయన ధర్మపత్ని గౌరీమణి ఆరోపిస్తున్నారు! దీనికిమీరేమంటారు?"

కేశవభట్టు ఎక్కడ తొణకలేదు!

"పరమశివ సోమయాజి నా కత్యంతాత్మీయులు! ఆయన పరమపదించారన్న దుర్వార్త వినగానే నా కీ జీవితంమీదే విపరీతమయిన విరక్తి కలిగింది! ఇటువంటి వాణ్ణి నే నాయనఎడల ఆవంతయినా ద్రోహం తలపెట్టగలనా?"

అతని గొంతులో డగ్గుత్తిక తొంగిచూచింది.

"నే నడిగినదానికి తిన్నగా సమాధానం చెప్పాలి మీరు!"

ప్రధానన్యాయాధికారి గొంతు ఖంగుమని మారుమ్రోగింది.

"నే నేపాపము ఎరగను! ఆయన దుర్మరణ వార్త నాకు నిన్ననే తెలిసింది."

"అయితే ఆ చేతబడి పిండిబొమ్మ ఆ పరమశివ సోమయాజిగారి పెరటి మూల కెలాగ వచ్చింది?"

"దానికి నేనేమి చెప్పగలను? అది నిశితంగా పరిశీలించి తేల్చుకోవలసింది మీరు!"

కేశవభట్టు కంఠం మరింత దృఢంగా, నిశ్చలంగా వినిపించింది.

"అయినా మీ మాటమీద మా కేమాత్రము నమ్మిక కలగడంలేదు! మంత్ర తంత్ర పరీక్ష జరిగిన అనంతరమే మీ నిర్దోషిత్వం నిర్ణయిస్తాము."

"దానికేమి? సర్వదా నే నన్ని పరీక్షలకు సంసిద్ధంగానే ఉన్నాను!"

మరి మార్గాంతరమేమి లేకపోయినందువల్ల ఆనాడే కొంచెం పొద్దువాలిన తరవాత కేశవభట్టు పరీక్ష ప్రారంభమయింది.

ఆ కాలంలో శ్రీనగరంలో సుప్రసిద్ధమయిన త్రిభువనస్వామి దేవళమే ఆ పరిశీలన కనువయిన స్థలంగా తాంత్రికవేత్త ఎన్నుకున్నాడు. ఆ బ్రాహ్మణ వృద్ధుడానాడు వరిపిండితో దేవాలయం చుట్టూరా రెండడుగుల వెడల్పున పరిశుభ్రమయిన బాట ఏర్పరిచాడు. ఆ పరీక్షా సమయానికి అక్కడికి వచ్చిన చంద్రాపీడ చక్రవర్తి ఆయా ఏర్పాటులన్నీ స్వయంగా పరిశీలించాడు. శ్రీనగరంలోని ప్రజ లాతృతగా ఆ విడ్డూరం గమనించాలని ఆ దేవాలయం చుట్టు గుంపులు గుంపులుగా గుమిగూడారు.

మాంత్రిక బ్రాహ్మణుడు మున్ముందుగా త్రిభువనస్వామి నొక్కమారు మనసారా సంస్మరించుకున్నాడు. చేతులెత్తి నమస్కరించి, అంభోధ గర్జనంవంటి గభీర స్వరంతో మంత్రా లుచ్చరించడం ప్రారంభించాడు. ఆ మంత్రపఠనం చెవిని పడగానే నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ తన ప్రదక్షిణం ప్రారంభించాడు కేశవభట్టు.

'కేశవభట్టుగా రొకవేళ ఏ పాపము ఎరగరేమో! లేకపోతే అంతటి నిశ్చలమయిన చిరునవ్వు ఆయన పెదవులమీద ఎలాగ మొలకెత్తుతుంది?' అనుకున్నాడు అతని ముఖభంగిమ నిశితంగా పరిశీలిస్తున్న చక్రవర్తి.

మొదటి ప్రదక్షిణ ముగిసింది. కాని ఎక్కడ బాటలో బ్రహ్మహత్య పాదముద్ర కానరాలేదు! కేశవభట్టు ఇనుమడించిన ధైర్యంతో రెండవ ప్రదక్షిణం ప్రారంభించాడు. మరికొన్ని నిమిషాలలోనే అది ముగిసింది. అయినా ఆ గుర్తు ఎక్కడ కానరాలేదు!

కేశవభట్టు చేస్తున్న మూడవ ప్రదక్షిణం సగం పైగా ముగిసింది! అయినా అత డెక్కడ చెక్కుచెదిరినట్టు కుబడలేదు! అంతలోనే మాంత్రికుడు మంత్రపఠనం నిలిపి, తన యావచ్ఛక్తిని వినియోగించి గట్టిగా గొంతెత్తి గర్జించాడు.

"ఇక్కడినుంచి ప్రతి అడుగు బాగా జాగ్రత్తగా పడాలి!"

కేశవభట్టు అతని ఆనతి శిరసావహించాడు. ఇక నాలుగయిదు అడుగులలోనే మూడవప్రదక్షిణం ముగియబోతున్నది! అర్ధక్షణంలో కేశవభట్టు ఒక్కమారు వెనక్కి తిరిగి తన అడుగుజాడ చూసుకున్నాడు. నిజానికి దాని వెనకాల బ్రహ్మహత్య అడుగుజాడలేవి లేవు! అయినా అతని కళ్ళెదుట ఏమి సాక్షాత్కరించిందో మరి! వెనువెంటనే కుప్పగా కూలబడిపోయాడు!

"మహాప్రభూ! నావల్లనే ఆ చేతబడి జరిగింది. చేజేతుల చేసిన నేరం నే నంగీకరిస్తున్నాను!"

అయినా మాంత్రికు డంతమాత్రంచేత విడిచిపెట్టలేదు! ఆ మిగిలిన నాలుగయిదు అడుగులు వేసితీరాలని పట్టుపట్టాడు. కేశవభట్టు నోట మాటలేక అంగీకరించి, అలాగే నెమ్మదిగా రెండడుగులు వేశాడు. అతన్ని అనుసరిస్తున్న బ్రహ్మహత్యారాక్షసి అడుగుజాడలు రెండు వికృతాకారాలతో విస్పష్టంగా గోచరించాయి!

ఆపైన గౌరీమణి తన ప్రాయోపవేశం ముగించింది. కాని అదే పుణ్యస్త్రీ వేషంతో సహగమనం యథావిధిగా నెరవేర్చి శ్రీనగర పౌరుల జేజే లందుకున్నది.

ఆనాటి శిక్షాస్మృతి ననుసరించి, మరణదండన విధించడానికి వీలులేకపోయినందువల్ల కేశవభట్టు ఆస్తి అంతా స్వాధీనంచేసుకుని అతన్ని ఆనాడే కాశ్మీరంనుంచి వెళ్లగొట్టించాడు చంద్రాపీడచక్రవర్తి. ★


భద్రతకు రక్షణకు
50 షాట్ల మడత పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, అడవి జంతువులనుంచి మిమ్ము రక్షించుకొనండి. వనభోజనాలకు, ప్రయాణాలకు, నాటకాలకు ఉపయోగమైనది.



50 షాట్ల ఏర్పాటుతో దానంతట అది పని చేస్తుంది. తేలికైనది. మిరుమిట్లు గొలిపే దీని మంట మిమ్ము ప్రమాదం నుంచి కాపాడుతుంది. 50 షాట్లతో జర్మన్ మోడల్ నం. 99 వెల రు. 15-50. వి.పి.పి. చార్జీలు రు. 2-50. తోలుకేసు రు. 3—50. అదనపు షాట్లు నూరు రు. 5/—లు. మిలిటరీ జవాన్లకు, ఆఫీసర్లకు ప్రత్యేక తగ్గింపులు.

ATLAS CO. ( —16).
P.O. Box 1329, Delhi-6.

